1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | అక్టోబర్ 24, 2024 | www.navatelangana.com

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-భైంసా



ఆలయాల్లో దొంగతనాల నివారణకు గ్రామాభివృద్ధి కమిటీలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రూరల్ సీఐ నైలు సూచించారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామల వారీగా సెక్టార్‌లను ఏర్పాటు చేసి పోలీస్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చామన్నారు. గ్రామ పెద్దల నుండి సలహాలు, సూచనలు స్వీకరించారు. పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే, గంజాయి అమ్మితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్సై మారుతి, ఆయా గ్రామామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి పంటను కొనుగోలు చేయాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. బుధవారం మండలంలోని మిథల్, విజయ లక్ష్మీ, రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేశారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఈ నెల 25 నుంచి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,525తో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు 8 నుంచి 12శాతం లోపు తేమ ఉండేటట్లు చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మెంగు ప్రవీణ్, మార్కెట్ కార్యదర్శి దేవన్న, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ఏది సమయపాలన..?

- 12 గంటలు దాటిన విధులకు హాజరుకాని అధికారులు
- బోసిపోయిన తహసీల్దార్‌కార్యాలయం



నవతెలంగాణ-కుబీర్

ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా దూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. కార్యాలానికి వచ్చిన ప్రజలకు కాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్నాయి. బుధవారం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ధరణి ఆపరేటర్ సైతం సమయానికి విధులకు హాజరు కాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వారు వారి కోసం వేచి చూశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత డిప్యూటీ తహసీల్దార్ విధులకు హాజరుకాగా జూనియర్ అసిస్టెంట్ మాత్రం పర్మిషన్ తీసుకొని విధులకు హాజరు కాలేదని తెలిసింది. ఉన్నతాధికారులు విధులకు సమయానికి హాజరు కాకపోవడం వల్ల అది అదునుగా తీసుకొని కింది స్థాయి సిబ్బంది సైతం సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సిబ్బంది విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌లతో కలిసి ప్రారంభించారు. ప్రతి మహిళను కోటీశ్వరాలిని చేయాలనే ఆలోచనతో మహిళలను వ్యాపారంలో ప్రోత్సహిస్తోందన్నారు. కుటీర పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పించడమే కాకుండా వారికి అందులో రాణించేందుకు శిక్షణ సైతం అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని మహిళా స్వయం సహాయక సభ్యులు, మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఎంపీ నగేష్ మాట్లాడుతూ వ్యాపార రంగంలో వృద్ధి సాధించి తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలవాలని, ఇతరులకు ఆదర్శప్రాయం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, పాల్గొన్నారు.

గుజరాత్ మాదిరిగానే మద్దతు ధర ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుజరాత్‌లో కొనుగోలు చేస్తున్న విధంగానే పత్తి క్వింటాలుకు రూ. 8,800 మద్దతు ధర సైతం ఆదిలాబాద్‌లో ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో పండించే పత్తి అందరికంటే నాణ్యతగా ఉంటుందని అలాంటప్పుడు గుజరాత్ లో ఇస్తున్న మద్దతు ధర ఆదిలాబాద్ లో ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. పత్తికి తేమ శాతం 8 నుండి 12గా నిర్ణయించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గతంలో కొనుగోళ్ల ప్రారంభంలో 20శాతం ఉన్న కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఈసారి సైతం తేమ శాతం 20 శాతం ఉన్న కొనుగోలు చేయాలని లేని పక్షంలో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్, మార్కెట్ మాజీ చైర్మన్‌లు మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, డైరెక్టర్ పరమేశ్వర్, గంగయ్య, రమణ, వేంకటేష్ ఉన్నారు.

ఉద్యోగ గుర్తింపు కార్డులు కేటాయించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు త్వరగా ఉద్యోగ గుర్తింపు కార్డులు కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి కోరారు. జిల్లా ట్రెజరీ అధికారి భానుమతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడీలు వెంటనే కేటాయించాలన్నారు. కొన్ని మండలాలలో నూతన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడీకు మధ్యవర్తుల ద్వారా నగదు సేకరిస్తున్నట్టుగా తెలిసిందని, ఎటువంటి అవినీతి లేకుండా మంజూరు చేయాలని, మధ్యవర్తులను నివారించాలన్నారు. నూతన ఉపాధ్యాయులు మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా తమ దరఖాస్తులను డీడీఓల ద్వారా జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించాలని తమ సంఘం సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని, సంఘం బాధ్యులను ఆశ్రయించాలని, మధ్య దళారుల ద్వారా మోసానికి గురికావద్దని సూచించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. వేసవిలో ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపదిత సెలవులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెగ్యులరైజేషన్, మెడికల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి రమేష్, మండలాల నాయకత్వం హరీష్ బాజీ ఖాన్, ఆరిఫ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చే ముందు జిల్లా ప్రజలకు, నిరుద్యోగులకు, రైతులకు, ప్రభుత్వ ఉద్యోగులకు క్షమాపణ చెప్పి జిల్లాలో అడుగు పెట్టాలని కాంగ్రెస్ కమిటీ కార్యానిర్వహణ అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ జిల్లా పర్యటనకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. ఎవరికి కూడా అధికారంలోనున్న సమయంలో ఏమి చేయలేదన్నారు. అధికారం లేకపోవడంతో ప్రజలపై ప్రేమ చూపుతు వస్తున్నారని ఆరోపించారు.

అంకోలి ఆస్పత్రిని సందర్శించిన ఐఆర్ఎస్ అధికారి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని అంకోలి ఆస్పత్రిని ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్ కృష్ణ సందర్శించారు. రికార్డులతో పాటు పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. మందుల నిల్వ, డెలివరీ రూమ్, ఓపీ, వ్యాక్సిన్ రూంలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డా.సర్ఫరాజ్, డా.సాగర్, డా.కష్టాల చంద్రశేకర్, స్టాఫ్ నర్స్ రాజ్యలక్ష్మి, ఈశ్వర్ రెడ్డి, ప్రేమ్‌సింగ్, తిరుమల, సమి, ప్రతిమ పాల్గొన్నారు. అనంతరం వాఘాపూర్ సబ్ సెంటర్, కోలామ్ గూడ చాకటి కపిల బాయి లెప్రాసి ఎంపీ కేసు ఫాలో అప్ చేసి కేసు వివరాలు అడిగి తెల్సుకుంటున్న జిల్లా లెప్రాసి అధికారులు సిడాం వామన్ రావ్, సీహెచ్. రమేష్, అంకొలి సూపర్‌వైజర్స్ బొమ్మెత సుభాష్, శకుంతల, ఎంఎల్‌హెచ్‌పీ రోజా రమణి, ఆశ గౌరు బాయి పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ట్రిపుల్ ఐటీ వీసీ



నవతెలంగాణ-ముధోల్

హైదరాబాద్ రాజ్ భవన్‌లోని గవర్నర్ కార్యాలయంలో బుధవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను బాసర ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్‌లు వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశంలో భాగంగా బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ గోవర్ధన్ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ బాసరలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలను గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బూర వెంకటేశం, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలున్నారు.

అంగన్‌వాడీ మెడలోంచి బంగారు గొలుసు దొంగతనం

నవతెలంగాణ-తలమడుగు

అంగన్‌వాడీ టీచర్ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో చోటు చేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ శోభ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆమె అంగన్‌వాడీ కేంద్రం నుంచి విధులు ముగించుకొని ఎప్పటిలాగే ఇంటికి వెళ్తోంది. ఇదే క్రమంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి మెడలో నుంచి గొలుసును లాక్కెళ్లారు. ఆమె కేకలు వేయడంతో గ్రామస్తులు పోగయ్యారు. దీంతో ఆ దొంగలు మహారాష్ట్ర వైపు పరారయ్యారు. గ్రామస్తులు మహారాష్ట్ర సరిహద్దు తలాయి గూడ చెక్‌పోస్ట్ వద్ద సమాచారం అందించనప్పటికి దొరకలేదు. మోటార్ సైకిల్‌తో ఇతర మార్గాలకు వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కాగా సంఘటన స్థలానికి డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై అంజమ్మతో పాటు పోలీస్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. దొంగతనం అయిన గొలుసు రెండున్నర తులాలు ఉంటుందని అంగన్‌వాడీ టీచర్ తన ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై అంజమ్మ తెలిపారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జడ్పీ హై స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ విద్యార్థులకు పోలీసులు విధుల నిర్వహణ, ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లాలో అమరులైన పోలీసుల గురించి వివరించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సంస్మరణ వారోత్సవాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్సై సునీల్ పాల్గొన్నారు.

తలమడుగు : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్సై అంజమ్మ ఓపెన్ హౌజ్ నిర్వహించారు. పోలీసులు విధులు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏ రోజు కూడా తన కుటుంబాన్ని గురించి ఆలోచించకుండా ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా శాంతియుతంగా ప్రజలు జీవించాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కైసర్, గోపాల్, ప్రభాకర్, రామ్ రెడ్డి, ప్రహ్లాద్, నవీన్, గోపాల్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగ వ్యతిరేక విధానాలు వీడాలి

- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలు వీడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చి ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక చదువుకు దూరం కావాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎన్నికలకు ముందు విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెబుతున్న నేతలు ఆ తర్వాత అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మల నాగేశ్వర్ రావును కలిసిన కంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. పంటలు నష్టపోయిన ఆదిలాబాద్ రైతులకు నష్ట పరిహారం అందించినందుకు, ఎకరానికి 10 క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు నిర్ణయం తీసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బేల మండలానికి వ్యవసాయ మార్కెట్ కమిటీని కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. త్వరలో జరిగే జైనథ్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి హాజరు కావాలని మంత్రి తుమ్మలను ఆహ్వానించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికి గెలుపు ఓటములు సహజమని ప్రతిదాన్ని స్పోర్టింగ్ స్పిరిట్‌గా తీసుకొని ముందుకు సాగాలనారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉంటుందన్నారు. ఆర్‌సీఓ రాథోడ్ గోపీచంద్ మాట్లాడుతూ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో క్రీడలకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తూ విద్యార్థుల సర్వతో అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 13 పాఠశాలకు సంబంధించిన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర జోనల్‌కు ముందు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. అంతకుముందు ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాలను ఆవిష్కరించి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి రెడ్డి, కౌన్సిలర్ పవన్ నాయక్, మాజీ జడ్పీటీసీ రాజు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే కేటీఆర్ పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంతులేని అవినీతి జరిగిందని, పదేండ్లలో ఏంచేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి తప్పా మరొకటి కాదన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు పదేండ్లు అధికారం కట్టబెడితే ఏం చేశారంటూ ప్రశ్నించారు. స్కీముల్లో స్కాములు తప్పా పెద్దగా చేసింది ఏమీలేదని దుయ్యబట్టారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఉన్నారు.

ఆదివాసీ గిరిజనులపై దాడులు ఆపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అడవులను జీవనాధారంగా చేసుకుని జీవనం సాగించే అటవీశాఖ అధికారులు ఆదివాసీ గిరిజనులపై దాడులు, వేధింపులు ఆపాలని ఆదివాసీ నేత కొడప సోనేరావు అన్నారు. అటవీ శాఖ అధికారుల తీరుకు నిరసనగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం ఎదుట ఆదివాసీ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజన మహిళ పట్ల ఫారెస్ట్ అధికారి దురుసుగా ప్రవర్తించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ నుండి కట్టెల కోసం వచ్చిన మహిళను పట్టుకుని దుర్భషలాడారని ఆరోపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే సంబంధిత అధికారి గులాబ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. అమాయకులైన ఆదివాసీ గిరిజనులను అడవులకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు ఆపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులున్నారు.

108లో ప్రసవం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మలేపూర్ గ్రామానికి చెందిన గర్భిణీ అవిద్యకు పురిటి నొప్పుల రావడంతో బుధవారం కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్నారు. నొప్పులు ఎక్కువ కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో సిబ్బంది సహకారంతో మధ్యలోనే ప్రసవం చేశారు. పండంటి అడ బిడ్డను జన్మించింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఈఎంటీ ఆర్ కైలాష్, పైలెట్ సుందర్ సింగ్ తెలిపారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పక వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్

రైతులు తమ వద్ద ఉన్న పశువులకు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని గాదిగూడ పశు వైద్య సహాయకుడు ఆనంద్ కిషోర్ సూచించారు. బుధవారం మండలంలోని లోకారి-బి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఆవులకు వ్యాక్సిన్ ఇచ్చారు. కొన్న సాగే వ్యాక్సిన్ కార్యక్రమాన్ని యజమానులు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది వినోద్ ఉన్నారు.

సూరు వర్ధంతి పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని దంతన్‌పల్లి పరిధిలో గల కోలాంగూడలో నిర్వహించే కుంరం సూరు వర్ధంతి వర్ధంతి పోస్టర్లను వర్ధంతి కమిటీ నాయకులు విడుదల చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్ ఆవరణలో శుక్రవారం జరగనున్న సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని వర్ధంతి కమిటీ చైర్మన్ టేకం భీమ్‌రావు, నిర్వహణ కమిటీ కన్వీనర్ కుమ్ర రాజు, సూరు వారసుడు కుంరం లేతు కోరారు. ఈనెల 25న నిర్వహించే సూరు వర్ధంతి కార్యక్రమానికి విద్యావంతులు మేధావులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కొలం యువజన సంఘం నాయకులు కొడప లక్ష్మణ్, ఆత్రం శ్రీను, ఆత్రం దినేష్, మడవి మహేష్, కుమ్ర రాంశావుమీ పాల్గొన్నారు.

నేటి సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడోటోరియంలో ఈనెల 24న జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల సభ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎర్రజి హరీష్ మడావి గణేష్ కోరారు. బుధవారం కుమురం భీం భవనంలో సమావేశం నిర్వహించారు. స్వర్ణ ఉత్సవ సభను పూర్వ ప్రస్తుత విద్యార్థి నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కళావతి, జిల్లా నాయకులు సారుక, నికిత, ప్రీతి, భాగ్యశ్రీ, రజిత గిరిజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బొంగొని లక్ష్మీ రెండు రోజుల కింద కోతుల దాడిలో మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం బుధవారం మృతురాలి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చైర్మెన్ వెంట నాయకులు పరిమి సురేష్, అమనుల్లాఖాన్, షబ్బీర్ పాషా, కాలనీవాసులు వేల్పుల అశోక్, శంకర్, మహేశ్వర్, లక్ష్మణ్‌గౌడ్, కుటుంబ సభ్యులు ఉన్నారు.



బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని రాజుర గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న భీమర్తి పెద్దిరాజు, చిలివేరి మల్లేష్, గుమ్ముల నర్సవ్వ, చందు నాయక్ తండాలో గుగ్లావత్ జంజ్యానాయక్‌ను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. అనంతరం ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగం సాధించిన గడ్డం దినకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మూలమలుపుల వద్ద పిచ్చి మొక్కల తొలగింపు



నవతెలంగాణ-కడెం

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగానే ప్రమాదకర మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలోని ప్రమాదకర మూలమలుపు వద్ద గ్రామస్తుల సహకారంతో పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డుకు ఇరువైపుల బ్లేడు ట్రాక్టర్ సహాయంతో చదును చేయించారు. ఇటీవల ధర్మాజీపేట్ మూలమలుపు వద్ద 2 ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాల నివారణలో భాగంగా మూలమలుపు నుంచి ధర్మాజీపేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన ఏలేటి మనోజ్‌రెడ్డి పలు సమస్యలతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రిలో చేరడంతో వారికి బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అడిగిన వెంటనే సీఎంఆర్ఎఫ్ పథకం కింద బుధవారం రూ.2లక్షల 50వేలు మంజూరు చేయించి ఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సాయం కోసం రూ.10లక్షల వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వైద్య ఖర్చులకు అందించి బాధితులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మాడల్ లైబ్రరీ ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలో ఎంపీపీఎస్ పాఠశాలలో మాడల్ లైబ్రరీ నుంచి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లైబ్రరీని విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సస్పెండైన ఏఈఓలకు సంఘీభావం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

రైతు బీమాలో నిర్లక్ష్యం వహించారని సాకు చూపుతూ 163 మంది ఏఈఓలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వారి సహోద్యోగులు సంఘీభావం తెలుపడానికి బుధవారం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్ మాట్లాడుతూ సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్టోబర్ 27, 28న పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను జయప్రదం చేయలని, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో నిరుద్యోగ సమస్య అధికమయిందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడం మూలంగానే దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవడం లేదని వారు విమర్శించారు. అందుకే అక్టోబర్ 27, 28 తేదీల్లో పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనిలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని, ఈ వర్క్ షాప్‌లో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై బోధనలు, చర్చలు, నిర్ణయాలు ఉంటాయని, ఈ వర్క్ షాప్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి యువజన నాయకత్వం పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కొట్నాక్ ఆనంద్, బాలు, పెందూర్ దిలీప్, కిరణ్, అనిల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విభాగ్ సంఘటన కార్యదర్శి రాజుసాగర్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని సంస్థలో పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్త నిస్వార్థంగా సమాజం కోసం పనిచేస్తూ, విద్యారంగ సమస్యల పట్ల అనేక ఉద్యమాలు చేస్తుందన్నారు. అనంతరం 2024-25 సంవత్సర నూతన నిర్మల్ నగర కమిటీ ఎన్నుకున్నారు. నిర్మల్ నగర కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా విలాస్, నితిన్, నిమ్మల సాయి, విష్ణు చరణ్, నగర సంయుక్త కార్యదర్శిగా మున్నా, జీవన్, చరణ్, అంబాదాస్, సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మణ్, రాజు, నవనీత్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యకుమార్, రాష్ట్ర వానవాసి ప్రముఖ్ లక్ష్మణ్, చోవహన్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల మహాసభలు జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 25న జరిగే సీపీఐ(ఎం) ఆదిలాబాద్ రూరల్ మండల మహాసభలను జయప్రదం చేయాలని, ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాట రూపకల్పన చేసేందుకే ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల సమగ్ర అభివృద్ధికై, గిరిజన గ్రామాల అభివృద్ధికై తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితులకు నష్ట పరిహారం రూ.25లక్షలు ఇవ్వాలని, సాత్నాల ఎడమ కాలువ నుంచి పంట భూములకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్ రాములు, జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా నాయకులు హాజరువుతారని తెలిపారు. ఈ మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి స్వామి, నాయకులు ఆశన్న, స్వామి, విష్ణు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల అమలు తీరుపై శిక్షణ కలెక్టర్‌ల ఆరా



నవతెలంగాణ-బేల

సంక్షేమ పథకాల అమలు తీరుపై శిక్షణ కలెక్టర్‌ల ఆరా తీశారు. బుధవారం మండలంలోని సిర్సన్న గ్రామాన్ని సందర్శించారు. గత రెండు రోజుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణాధికారులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ గ్రామస్తులతో మమేకమయ్యారు. దీనిలో భాగంగా గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, అదేవిధంగా రేషన్‌షాప్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలతో చర్చించి, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక ఇలా కొన్ని ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. వివిధ క్యాడర్‌లకు సంబందించిన శివమ్, పనీత్, సోనియా, నమ్రత, రవికుమార్ ఐదుగురు శిక్షణ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారులు మాట్లాడుతూ మా శిక్షణలో భాగంగా ఈ రోజు సిర్సన్న గ్రామానికి రావడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామస్తులు ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల యాక్టివిటీ గురించి వివరించారు. దీని బేస్‌గా చేసి వాటిని క్షుణ్ణంగా ఐదు రోజులు పరిశీలించినా తరువాత తమ రిపోర్ట్‌ని మర్రి చెన్నరెడ్డి శిక్షణ కేంద్రానికి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆశాలపై అధికారుల వేధింపులు, టార్గెట్ విధానాలను వెంటనే ఆపాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు చంద్రకళ, గంగామణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం స్థానిక టీఎన్జీవో భవనంలో సిహెచ్ చంద్రకళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ సెంటర్లలో డ్యూటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాలని ఇబ్బంది పెడుతున్నారని వెంటనే ఈ చర్యను మానుకోవాలన్నారు. బైంసా పట్టణంలో ఆశాలతో డిజిటల్ సర్వేలు చేయించడం సమంజసం కాదన్నారు. పారితోషకం లేని అనేక పనులు ఆశాలతో చేయిస్తున్నారన్నారు. ఆశాలకు జాబ్ చార్ట్, కనీస వేతనం రూ.18వేలు, పెండింగ్‌లో ఉన్న పల్స్ పోలియో, లెప్రసీ డబ్బులు విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 20 తర్వాత ఆశా వర్కర్ల బస్సు యాత్ర, పాదయాత్ర, అధికారులకు వినతిపత్రాలు అందించడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు అనసూయ, సభ్యులు మౌనిక, పద్మ, జ్యోతి, నందా, రేఖ, రాణి, భాగ్యలక్ష్మి, రాధా, పోసాని, దేవిక, లక్ష్మి పాల్గొన్నారు.



ఏజెన్సీ చట్టాలకు లోబడి పని చేయాలి



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ తొమ్మిది తెగల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడే శంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ని అమలు పర్చాలని కోరారు. గిరిజన గ్రామాల్లో 29 శాఖలకు సంబందించిన అధికారులు గిరిజన చట్టలకు లోబడి పని చేయాలని పేర్కొన్నారు. పేసా 1/70 చట్టం ప్రకారం తేదీ 3ఫిబ్రవరి1970 తరవాత గిరిజన గ్రామాల్లో గిరిజనేతరులకు స్థిర నివాసం, ఇండ్ల నిర్మాణాలు, వ్యాపారంతో పాటు ఎలాంటి కార్యకలాపాలకు అనుమతి లేదని అన్నారు. మండల కేంద్రంలోని భూరాన్‌పూర్ శివవారం 29/ఏ సర్వేకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, రాబోయే రోజుల్లో చర్యలు తీసుకోని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షులు సిడం నంద కుమార్, రాయి సెంటర్ అధ్యక్షులు కోరంగే సోనేరావ్, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతినివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 25న ఛలో హైదరాబాద్ మహా ధర్నాకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ సిబ్బంది పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న చేపట్టే మహాధర్నాకు కార్మికులందరూ పాల్గొనాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించుకోవడంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, ఈ మహాధర్నాని విజయవంతం చేసే బాధ్యత ప్రతి కార్మికులపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, డ్రైవర్ విభాగం అధ్యక్షులు జనార్దన్, జనరల్ సెక్రటరీ అజీమ్, షబ్బీర్ దయానంద్, కుమార్ పాల్గొన్నారు.



మహాలక్ష్మిని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారిని బుధవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ చైర్మెన్ కుమారుడు శ్రీకాంత్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకి పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీంరెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, మాజీ ఏఎంసీ చైర్మెన్ చిలుక రమణ, మహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మెన్ కుమార్ గంగాధర్, దేవరకోట చైర్మెన్ కొండ శ్రీనివాస్, బురాజ్, పోతన్న, పెండం శ్రీనివాస్, చైతన్య, ఏఎంసీ డైరెక్టర్ పరంకుశం వంశీ, నిమ్మ సాయన్న ఉన్నారు.



మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి

● కౌన్సిలర్ చందులాల్



నవతెలంగాణ-భైంసా

ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని, భైంసా పట్టణ నాలుగో వార్డ్ కౌన్సిలర్ చందూలాల్ సూచించారు. బుధవారం ఏపీనగర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతులను సద్వినియోగపర్చుకొని మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని, ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడెల్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షులు మోహన్, మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు చోండి రాజేశ్వర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షల తీరు పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని అనంతపేట్ కేజీబీవీ పాఠశాలను డీఈఓ రవీందర్‌రెడ్డి సందర్శించారు. జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఏ వన్ పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షలు సజావుగా సాగేలా సంబంధిత అధికారులు చూడాలని అన్నారు. ఈ సందర్భంగా డీఈఓ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్న భార్య నవనీతపై భర్త గోవింద్ కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కాపాడి ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల బాధ్యులతో సమావేశం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల బాధ్యులతో బుధవారం ఎస్సై శ్రీకాంత్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే 24 గంటల పాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరం అయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడెల్లి మహా పోచమ్మ ఆలయం, స్వర్ణలోని కోదండ రామాలయం, జామ్ గ్రామంలోని శ్రీ పట్టాభి సీతారామ ఆలయం, వంజర్‌లోని శ్రీ మహాలక్ష్మీ ఆలయాల బాధ్యులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి

● సీఐ రహీమ్ పాషా

నవతెలంగాణ-నార్నూర్

పోలీసుల సేవలు మరువలేనివని సీఐ రహీమ్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసుల స్మారక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా పోలీసు అమరవీరులకు జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసులు తమ కుటుంబాన్ని లెక్క చేయకుండా నిరంతరం ప్రజలకోసం పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారెడ్డి, ఏఆర్ఎస్సై జాదవ్ కాంతారావ్, పోలీసు సిబ్బంది తొడసం నాగోరావ్, రమేష్, అశోక్, నరేందర్, జైవంత్, రాజు నాయక్, నరేష్, నానక్ సింగ్, ఏకలవ్య గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులు హేయమైన చర్య

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గ్రామ దేవత అయినా ముత్యాలమ్మ మందిరంపై జరిగిన దాడి హేయమైన చర్య అని ఇటువంటి దాడులు హిందూ మనోభావాలను తీసే విధంగా ఉన్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. సనాతన ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ముత్యాలమ్మ విగ్రహంపై జరిగిన దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జిలతో గాంధీచౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఎడిపెల్లి నరేందర్, పద్మాకర్, బిట్లింగ్ నవీన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఓడిశెల అర్జున్, కూన లింగన్న, ఆకుల కార్తీక్, ముప్పిడి రాకేష్, సుంకరి సాయి, విగ్నేష్, పాలిదే మహేందర్, సాధం ఆనంద్, కిషోర్, వెంకట స్వామి, వస్త్రాల శివప్రసాద్, పుదారి నగేష్, అల్లాడి శ్రీనివాస్, జాప విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



నవంబర్ 2, 3 తేదీల్లో కాగజ్‌నగర్‌లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రస్థాయి సమావేశాలకు జిల్లాలోని విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, గణపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సొసైటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కొత్తపల్లి వెంకటలక్ష్మీ చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని డా.కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణ, భోజన సదుపాయం కల్పించి 11 మందికి ఆపరేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

పశువులను బొలోరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇందాని ఎక్స్ రోడ్డు పోలీస్ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా వాంకిడి నుంచి కెరమెరికి పశువులను తరలిస్తున్న బొలోరో వాహనాన్ని పట్టుకున్నామన్నారు. రవాణా చేసేందుకు వారి వద్ద పశువులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని, యానిమల్ ట్రాన్స్‌పోర్టేషన్ రూల్స్ పాటించని వాహనదారుడు కెరమెరి మండలానికి చెందిన షేక్ తాజుద్దీన్‌పై కేసు నమోదు చేసి బోలెరో వాహనాన్ని సీజ్ చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసిఫాబాద్ సీఐగా బుద్దే రవీందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా ఇంటలిజెన్స్‌లో పనిచేసే బదిలీపై వచ్చిన బుద్దె రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ సతీష్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

జిల్లా ఎస్పీని కలిసిన సీఐ

ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్దె రవీందర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యత యుతంగా విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు.

ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలంలోని హట్టి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అధికారులు, సిబ్బంది క్షేతస్థాయి పరిశీలనకు వెళ్ళినప్పుడు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను సందర్శించి రిజిస్టరు, వంట సామాగ్రి నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధునీకరణ చేస్తున్నందున ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా మూత్రశాలల పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధునికి ఘన నివాళి



నవతెలంగాణ-బెజ్జూరు

జల్, జంగిల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసుల పక్షాన పోరాడి అసువులు బాసిన పోరాట యోధుడు కుమురం భీంకు ఘన నివాళి అందించారు. బుధవారం కుమురం భీం జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ఆదివాసీ సంఘాలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలు ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ఆవరణలో గిరిజన గుస్సాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోరాట యోధుడు భీం అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సకారం, తిరుపతి శంకర్, కొడప శంకర్, విశ్వేశ్వరరావు, పెద్దల శంకర్, ఓం ప్రకాష్, మహిళా నాయకురాళ్లు సరోజన, అమృత, పద్మ, ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేశ్వర్, ఏటీడీఓ కమార్ హుస్సేన్ ఉన్నారు

కౌటాల : కుమురం భీం జయంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలో రాజ్ గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, డీసీఎంస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన కుమురం భీం సేవలను కొనియాడారు. ఆదివాసీలు ఐకమత్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాలన్నారు. కార్యక్రమంలో మండల మాజీ ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేతన... వేతలు

- ఆర్థిక ఇబ్బందుల్లో పేసా యాక్ట్ మోబె లేజర్స్
- 11 నెలలుగా అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో 208మంది

నవతెలంగాణ-కెరమెరి



ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఆదివాసులు నివసిస్తున్న గ్రామాలకు గత ప్రభుత్వం 2017లో పేసా మొబైలేజర్‌లను నియమించింది. ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలలో జీవిస్తున్న ఆదివాసీ గిరి ప్రజలను చైతన్య వంతం చేయడం, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో 208మంది పేసా మోబేలేజర్లను నియమించింది. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలలో పేసా గ్రామ సభలు నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్దిదారులకు అందేలా కృషి చేస్తున్నారు. గిరి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.

2500 నుంచి 4000 పెంచిన ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల మోబెలైజర్లకు రూ. 2500 అందించింది. అయితే వారి సమస్యలను గుర్తించిన ఖానాపూర్ ఎమ్మెల్యే చొరవతీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4000లకు పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వారికి సంభందించిన కొన్ని నెలల పెండింగ్ వేతనాలు చెల్లించగా ఇంకా 11 నెలలుగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. అసలే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటు తున్న నేపథ్యంలో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెల వేతనాలు చెల్లించాలి

మడావి భరత్ భూషణ్, పేసా మొబేలేజర్ ధనోర.



ఆదివాసీ గుడెల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులకు అందేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వం మా సేవలను గుర్తించి పెంచిన వేతనాలు ప్రతి నెల చెలించాలి.

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

తుకారం సిద్ధికి, సాకడ



11 నెలలుగా వేతనాలు రాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. రోజు వారీ ఖర్చులతో అప్పులు చేయాల్సి వస్తుంది. నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం మా సేవలను గుర్తించాలి. దీపావళి పండుగకు ముందే మా పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

జిల్లా సమావేశానికి సర్వం సిద్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 28న ఆదిలాబాద్‌లో నిర్వహించే సమావేశానికి అన్ని కులాల ప్రతినిధులు అధికారులను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాలలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గౌడ్ జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, డీపీఓ బిక్షపతి గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి సజీవన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఈ నెల 28న వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సు జిల్లాలోని అన్ని కులాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ నియోజకవర్గాల శాసనసభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదస్సు విజయవంతం చేసే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అమృత్ 2.0 క్రింద ఎంపికైనందున మున్సిపల్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అమృత్ 2.0 ఫిదా ఎంపికైనందున మున్సిపాలిటీలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు వచ్చే 20 సంవత్సరాలకు చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో జీఏఎస్ డ్రోన్ సిస్టం ద్వారా మున్సిపాలిటీని చిత్రించడం జరుగుతుందని, 10 సంవత్సరాల కాలంలో పట్టణంలోని వివరాలు, వచ్చే 20 సంవత్సరాల నాటికి ప్రజలకు అవసరమైన వాటిని గుర్తించి ప్రణాళికలను శాఖల వారీగా ఈ నెల 31వలోగా మున్సిపల్ కమిషనర్‌కు అందించాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని లోడపల్లి, కొండపల్లి, జైహింద్‌పూర్ గ్రామాల్లో ఎంపీడీఓ ఆల్బర్ట్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తవాడలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పర్యటించి సానిటేషన్, తాగునీరు సరఫరాను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. దీనిలో భాగంగా గ్రామస్తులు కొత్తవాడలో మిని అంగన్‌వాడీ సెంటర్ కావాలని, ఎంపీయూపీఎస్ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి సౌకర్యాన్ని పూర్తిచేయాలని కోరారు. అక్కడి నుంచి కొండపల్లిలో ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటికి ఏర్పాటు చేసిన వాటర్ మోటార్‌ను మరమ్మత్తులు చేయాలని కోరారు. కొండపల్లి గ్రామంలోని గొల్లవాడకు వెళ్ళే మార్గంలో ఉన్న వాగుకు వంతనను నిర్మించాలని గ్రామస్తులు విన్నవించారు. అక్కడి నుండి జైహిందపూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామాల్లోని సానిటేషన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల వద్ద పిల్లలకు తాగు నీటి కోసం బొర్వెల్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులు గిరివికాస్ కార్యక్రమంలో మంజూరై ఉన్న బోర్వెల్ వేసుకోవడానికి ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, డీఈ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంఈఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి పట్టాభూమి విరాళం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సదక్ గూడ గ్రామానికి పీఎం జన్మాన్ పథకంలో భాగంగా పీవీటీజీ కొలాం గిరిజనుల కోసం రూ.60 లక్షలతో మల్టీ పర్పస్ సెంటర్ భవనం మంజూరైంది. ఈ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన రాథోడ్ గులాబ్ తనకున్న పట్టాభూమిలో ఐదు గుంటల భూమిని విరాళంగా అందజేశారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం గుండయ్య, మాజీ సర్పంచ్ సిడాం అన్నిగా, సిడాం భీము, ఆత్రం భగవంత్ రావు, సిడాం మారు, ఆత్రం భీము, రాథోడ్ ప్రభు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని రికార్డులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) వివరాలను ఉపాధ్యాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వారీగా పొందుపర్చిన వారాంతపు, మాసపు పరీక్ష వివరాలను పరిశీలించారు. మారముల నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలా చేసినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి ఆడె ప్రకాష్, కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థులకు బ్యాంకు పాస్ బుక్కుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండంలోని ఆరెగూడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు జీరో అకౌంట్ పాస్‌బుక్‌లను ఎంపీడీఓ రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు జీరో అకౌంట్‌లు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం హెచ్ఎం పర్ష చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో 114 మంది విద్యార్థులకు ఉచిత పాస్ బుక్కులు అందజేశామని, ఇందుకు కృషి ఎస్‌బీఐ నజురుల్ నగర్ బ్రాంచ్ మేనేజర్ సందీప్ కుమార్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు రవి, లాలాజీ, మహేష్, కిరణ్, సత్యనారాయణ, పరమశివ, అనిత, సుగుణ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించాలి



నవతెలంగాణ-చింతలమానెపల్లి

కేజీబీవీల్లో బాలికలకు నాణ్యమైన విద్యానందించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను మండల ప్రత్యకాధికారి శ్రీనివాస్ రావు తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల నైపుణ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహరిగోడ, ఆట స్థలం కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. విద్యార్థులకు కావాల్సిన ఆట వస్తువులు ఎంపీడీఓ సమన్వయంతో సమకూర్చుతామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ కె. ప్రసాద్, ఎంపీఓ సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఆసిఫ్ అలీ ఉన్నారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాన్‌ఇండియా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జనార్ధన్, ఉపాధ్యక్షులు నాగేష్, మండల అధ్యక్షులు శ్రీకాంత్, సభ్యులు సమ్మయ్య గోపాల్ సాయికిరణ్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తీర్చినవారే నాయకుడు

నవతెలంగాణ-తలమడుగు

ఏ పార్టీ నాయకులైన ప్రజల సమస్యలు తెలుసుకొని తీర్చినవారే నిజమైన నాయకుడని విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహన్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలో ఏఈగా పని చేసిన సతీష్ కుమార్ బదిలీపై వెళ్తున్నందున మండల ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు సన్మానించడం గొప్ప విషయం అన్నారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలతోపాటు రాజకీయ నాయకులతో కలిసి మెలిసి పనిచేసి విద్యుత్ శాఖకు పేరు ప్రఖ్యాతలు తెచ్చి ప్రజల గుండెల్లో నిలిచిపోవడం గొప్ప విషయమన్నారు. ఏఈని ఘనంగా సన్మానించడం మాజీ జడ్పీటీసీని అభినందించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ సతీష్ కుమార్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించారని కొనియాడారు. కొత్తగా మండలానికి బదిలీపై వచ్చిన శ్రీనివాస్‌కు బదిలీపై వెళ్తున్న సతీష్ కుమార్‌కు మండల ప్రజలు ఘనంగా వీడ్కోలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ శాఖ డి వీరన్న, విద్యుత్ శాఖ సిబ్బంది సాయి, అశోక్, మహేందర్, మండల నాయకులు రాజేశ్వర్, బాబన్న, ప్రకాష్ రావు, అజయ్ రెడ్డి, రవికాంత్ యాదవ్, ఆశన్న యాదవ్, కమలాకర్, బాబు ఖాన్, నల్ల దేవదాస్, జ్ఞానేశ్వర్, యాదవ్, విలాస్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో గల సీఈఆర్ క్లబ్‌లో బుధవారం ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న 290 క్వార్టర్లకు గాను 532 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 107 మంది ఉద్యోగులు చేంజ్ ఆఫ్ క్వార్టర్‌లో క్వార్టర్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, డీవై పీఎం రాజేష్, సీనియర్ పీఓ పి కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్ పోస్టులకు కౌన్సిలింగ్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న 10 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న మెడికల్ ప్రాబ్లమ్స్ ఉన్న ఉద్యోగులకు ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలోని ఆధ్వర్యంలో బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమిటీ వారితో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ 23, 24, 25 తేదిలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులు తమ మెడికల్ రిపోర్టులను కమిటీ వారి ముందు ఉంచారు. బుధవారం జరిగిన కౌన్సిలింగ్‌లో 145 మందికి గాను 88 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సమీరా సంధాని పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు, నీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

● భీమారం ఎంపీడీఓ మదుసుధన్



నవతెలంగాణ-జైపూర్

మండలంలో పారిశుధ్య పనుల నిర్వాహణ నిరంతరం కొనసాగాలని, నీటి సరఫరాలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని స్థానిక ఎంపీడీఓ మదుసూధన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో పనుల నిర్వాహనపై సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీల నిర్వాహణపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమయానుగుణంగా మొక్కల పెంపకం ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా మిషన్ భగీరథ ద్వార నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించి గ్రామీణుల అవసరాల మేరకు నీటి సరఫరా కొనసాగించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పనుల నిర్వాహణ, పనుల గుర్తింపు, ఎస్టిమేట్స్ తయారు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ సతీష్ రెడ్డి, ఏపీఓ జీనత్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన కార్యాలయాలను ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

జనరల్ మేనేజర్ కార్యాలయంలోని ఆధునికరించిన ఏరియా ఇంజనీర్, ఫైనాన్స్ విభాగాన్ని బుధవారం ఏరియా జీఎం సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన వసతులను కల్పించడం జరుగుతుందని, అందులో భాగంగా కార్యాలయంలోని విభాగాలను ఆధునికరించడం జరిగిందని తెలిపారు. వీటిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు టి శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం పర్సనల్ అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, సీహెచ్పీ డీజీఎం చంద్రలింగం, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఫారెస్ట్ అధికారి చంద్రమణి, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

మండలంలో పంటల పరిశీన

నవతెలంగాణ-తాండూర్



మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన బుధవారం ఆకస్మికంగా పర్యటించి పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. అన్నారం గ్రామంలో రైతులతో మాట్లాడుతూ మండలంలో జూన్ జూలైలో తొలకరి వర్షపాతం తక్కువ నమోదు అయినందున వరి పంట పొలాలు చిరు పొట్ట దశలో ఉన్నాయని తెలిపారు. ముదురు నారు వేసిన రైతులు పంట పొలాల్లో సస్య రక్షణ చర్యలు చేపలన్నారుట్టాలన్నారు. ప్రస్తుతం వరిలో ఎండాకు తెగులు, కంకి నల్లీ ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు ప్రొపినోపాస్ 57 లీటర్‌కు రెండు మిల్లీ లీటర్ల చొప్పు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాటుక తెగులు, పసుపుముద్ద తెగులు రాకుండా ఉండడాని ట్రోపికోనజాల్ 25 ఈసీ లీటర్ నీటికి 1 మిల్లీ లీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. పత్తిలో పొగాకు నలి పురుగు నివారణకు తవుడులో అతి గాఢత కలిగిన పురుగుమందులను కలిపి ఉండలుగా చేసి పొలాల్లో చల్లుకోవాలని సూచించారు. పత్తి కోతకు వచ్చిన రైతులు ఏరివేతలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

● బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజన్న

నవతెలంగాణ-దండేపల్లి

తమ నాయకుడు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే తమ నాయకుడిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గంలో అందరిని భయభ్రాంతులకు గురిచేస్తుంది కాంగ్రెస్ నాయకులు అన్నారు. దొంగ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లుగా వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నరని ఆయన గుర్తు చేశారు. తమ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం లేదు కాబట్టి ఇటువంటి గ్రూపు తగాదాలకు సంబంధించిన అంశాలను తెర పైకి తీసుకొస్తున్నారని ఇవన్నీ పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గాదె శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పల్లె రాకేష్, ప్రధాన కార్యదర్శి బందేల రవి గౌడ్, కిషన్ మోర్చా అధ్యక్షుడు వనపర్తి రాకేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు గోడ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, బోడ నర్సింగ్, మాజీ ఎంపీపీ చిట్ల శ్రీనివాస్ నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, దుమ్మని సత్తయ్య, గుండ రవీందర్, కుమార్, రమణయ్య, వెంకటేష్, సురేష్, పవన్, గురువయ్య పాల్గొన్నారు.

27న మాదిగ ధర్మయుద్ధం మహా సభ

నవతెలంగాణ-జైపూర్



ఈ నెల 27న నిర్వహించ తలపెట్టనున్న మాదిగల ధర్మయుద్ధం మహా సభను విజయవంతం చేయ్యాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపడుతామని అంసెబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని ఈ సంధర్భంగా గుర్తు చేశారు. దేశంలో మొట్టమొదటగా వర్గీకరణ పూర్తి చేసి అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీసం స్పందించకపోవడం సరికాదన్నారు. కనీసం కమిటీలు కూడా వేయకుండా కాలాయాపన చేస్తూ మాదిగలను మోసం చేయడం సరికాదన్నారు. గ్రూప్-1, గ్రూప్-2తో పాటు డిసెంబర్ నాటికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి వర్గీకరణ లేకుండానే వాటిని భర్తీ పూర్తి చేసే పనిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలను మోసం చేస్తున్న ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 27న మాదిగల ధర్మయుద్ధం మహా సభను నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. మాదిగలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ మాదిగల ధర్మయుద్ధం సభకు మండలం నుంచి అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి చిప్పకుర్తి సతీష్ మాదిగ, చిప్పకుర్తి ప్రాన్సిస్, గోదారి కిషోర్, ప్రవీణ్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల చదువుల పట్ల వార్డెన్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా దళిత అభివద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలతో పాటు బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎవరైనా జ్వరం, ఇతర అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్తితిపై ఆరా తీశారు. వసతి గృహాల్లో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. కిచెన్, డైనింగ్ హాల్, ఇతర పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వసతి గృహాల్లో పలు రిజిస్టర్లను పరిశీలించారు. ముఖ్యంగా వచ్చే ఏడాది పరీక్షలను దృష్టిలో పెట్టుకుని వసతి గృహ సంక్షేమాధికారులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఉత్తీర్ణత శాతం పెరిగేలా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులతో వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీడీ వెంట హెచ్‌డబ్ల్యూఓ కిషోర్, రాజు, సునీత, సిబ్బంది ఉన్నారు.

పేద విద్యార్థులకు సహకారం అందిస్తాం

● కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్
● కేజీబీవీ విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసులు, ఫ్యాన్స్ అందజేత

నవతెలంగాణ-కాసిపేట



పేద విద్యార్థులకు కల్వరీ మినిస్ట్రీస్ ప్రవీణ్, షారోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్ జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థినులకు రూ.50 వేల విలువ గల 186 ప్లేట్లు, 186 గ్లాసులు, నాలుగు పెద్ద గోడ ఫ్యాన్లు అందించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి సిస్టర్ షారోన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిస్టర్ షారోన్ మాట్లాడుతూ ఏజెన్సీ మండలమైన కాసిపేటలోని అనేక గ్రామాల్లో పేదలకు తమ వంతుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, మారుమూల ప్రాంత విద్యార్థుల చదువుల కోసం అనేక సౌకర్యాలు కల్పించామని వివరించారు. అనంతరం విద్యార్థులకు కావాల్సిన వస్తువులు అందించిన కల్వరీ మినిస్ట్రీస్ ప్రవీణ్, షారోన్ ఫౌండేషన్‌కు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, తహసీల్దార్ భోజన్న, కాంగ్రెస్ నాయకులు దూడం మహేష్, ముత్తినేని రవి కుమార్, సిద్ధం తిరుపతి, దుర్గం గోపాల్, కస్తూర్బా ప్రిన్సిపాల్ సరిత, కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు'



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆర్టీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పీఎస్ఆర్ పై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటే అనన్నారు. జిల్లాలో భూకబ్జా, అక్రమ మట్టి దందాలకు అధికారులను, ప్రజలను, బెదిరింపులకు గురి చేసినా, గత ప్రభుత్వం కేసులు పెట్టలేదని అన్నారు. ఇపుడు చట్టం తనపని తాను చేసుకుంటూ వెళుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావులు ఇద్దరు కలిసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై, నిరాదారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని, ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తన అనుచరులు చేసిన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రయత్నిస్తున్నారని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కాంగ్రెస్ ప్రభుత్వం శిక్షిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పూర్ణచందర్ రావు, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, కౌన్సిలర్లు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం సాధించిన సౌమ్యకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని వినాయక నగర్‌కు చెందిన చిటికేసి వసంత, లచ్చన్నల కూతురు సౌమ్య ఒక ఉద్యోగం కాకుండా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. పోలీస్ జాబ్ ట్రైనింగ్‌లో ఉండగానే టీచర్ జాబ్ సాధించినందుకు బుదవారం వినాయక నగర్ మండలి తరపున సన్మానం చేశారు. పూలమాలలు, శాలువాలతో కాలని వాసులు సౌమ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో వినాయక మండల్ సభ్యులు జి మోహన్ రెడ్డి, సుజాత, హరికృష్ణ, అంజన్న, నవిత, మసూద్ పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా మట్టి సేకరించి బ్యాగుల్లో నింపుకోవాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వాహణపై దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ సూచించారు. బుధవారం ఇందారం, టేకుమట్ల గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరు వరకు ఎర్ర మట్టిని సేకరించి బ్యాగుల్లో నింపుకోవాలని అన్నారు. అదేవిదంగా మండలంలో గ్రామ పంచాయతీల వారిగా నర్సరీల నిర్వాహణకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నర్సరీ ఏరియాలను ముందుగా శుభ్రం చేసి మట్టి బ్యాగులు సిద్ధం చేసుకోవడం ద్వార సమయానుకూలంగా మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. నీటి వసతికి సంబంధించి ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని, సమయానుగుణంగా మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.

వ్యాపారస్తులు రోడ్డుపై క్రయవిక్రయాలు చేయరాదు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని వ్యాపారస్తులు ప్రధాన రోడ్డుపై క్రయవిక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు తెలిపారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కొత్త బస్టాండ్ నుండి కాంటా ఏరియా వరకు వ్యాపారం చేసే వారందరూ తమ హద్దుల్లోనే షాపులు నడిపించుకోవాలని సూచించారు. వ్యాపారస్తులు రోడ్డు మార్గాన్ని ఆక్రమించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు డ్రైనేజ్ పై అమ్మకాలు జరపడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. వ్యాపారస్తులు తమ హద్దులలో వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రజలకు వాహనాల రాకపోకలకు అసౌకర్యం కల్పిస్తేతెలంగాణ రాష్ట్ర చట్టం 2019 ప్రకారం, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాపారస్తులు హద్దు మీరి రోడ్డుమీద క్రయవిక్రయాలు జరిపితే జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. నిబంధనలు పాటించని షాపు యజమానుల షాపు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు

జీపీ భవన నిర్మాణానికి ఐక్యంగా ముందుకు సాగాలి

● ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ భవన నిర్మాణం విషయంలో గ్రామస్తులందరు ఐక్యంగా ముందుకు సాగాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ అన్నారు. ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి బుధవారం వెంకట్రావుపల్లి గ్రామస్థులతో ఏర్పాటు చేసిన గ్రామ సభలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం విషయమై గ్రామస్థులు చర్చించారు. అందరికి అందుబాటులో ఉండే విధంగా స్థలాన్ని గుర్తించి భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరముందని తెలిపారు. ఈ సంధర్భంగా గ్రామస్థులతో కలిసి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించారు. వివాదాలకు తావివ్వకుండా గ్రామస్థుల ఆమోదంతో నిర్మాణం చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజలు భవన నిర్మాణం విషయమై అదికారులతో చర్చించారు.

పూర్వ విద్యార్థుల చొరవతో మరుగుదొడ్లు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

నీటి సరఫరా లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు పూర్వ విద్యార్థుల చొరవతో ప్రారంభించుకోవడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాదుర్య అన్నారు. పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేసిన పూర్వ విదార్థుల బృందం (అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్)లతో కలిసి బుధవారం నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించినా నీటి వసతి లేకపోవడంతో ఇంతకాలం నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఫలితంగా ఆడ పిల్లలు మల మూత్ర విసర్జనకు అనేక ఇబ్బందులు ఎదుర్కొవల్సి వచ్చేదని, ఈ విషయం తెల్సుకున్న మెగా పూర్వ విద్యార్థులు మూత్రశాలలకు వాటర్ పైప్ లైన్ పనులు చేయించడం అభినందనీయమని అన్నారు.

దండారి దర్బార్ వాల్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సల్పాలవాగు సమీపంలోని వెంకటాద్రి గుడిలో ఈ నెల 27న నిర్వహించే ఆదివాసీ దండారి దర్బార్ వాల్ పోస్టర్లను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో విడుదల చేశారు. బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే దుర్గం



చిన్నయ్యను కార్యక్రమానికి రావాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దండారి దర్బార్ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్లు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ప్రధాన కార్యదర్శి సోయం సూరు, ప్రచార కార్యదర్శి ఆత్రం జంగు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఐతే మాకేం భయం

నవతెలంగాణ-తాంసి

పోలీస్ స్టేషన్ ఐతే మకేమైన భయమా..? పోలీసు వాళ్ళు ఎవరేమి చేయరనే విధంగా తయారయ్యారు మోటారు సైకిల్ చోదకులు. కాలేజీలకు వెళ్లే యువత జులాయిగా తిరిగే వారు మోటారు సైకిల్‌పై ఒకరూ లేదా ఇద్దరు ఉండాలనే విషయాన్ని పక్కకు పెట్టి ముగ్గురు నలుగురు వ్యక్తులు యాథేచ్ఛగా తిరుగుతున్నారు. పోలీసులంటే భయం లేకుండా పోలీస్ స్టేషన్ ముద్దరా నుండి నలుగురేసి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు.



ఉత్సాహంగా కదిలారు చెత్త తొలగించారు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులు బుధవారం ఉత్సాహంగా కదిలి స్వచ్ఛత కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ స్వచ్ఛత పఖ్వాడ స్పెషల్ కాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నివిభాగల అధిపతులు, ఉద్యోగులు గంట పాటు స్వచ్ఛత పనులు చేశారు. గడ్డి మొక్కలు, ముళ్ళ పొదలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క రోజుతో కాకుండా నిత్యం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోనేందుకు ఉద్యోగులు పదినిమిషాలైన కేటాయించాలని సూచించారు. సమిష్టిగా బెల్లంపల్లి ఏరియాను అన్ని రంగాల్లో ముందుండేలా ఉత్సాహం చూపాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కే.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేకర్, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి, సివిల్ (ఎస్ఈ) మదీనా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి రమేష్, ఐటీ ఇన్‌చయార్జి ముజీబ్ పాల్గొన్నారు.

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఆనంద్‌రావ్ పటేల్

నవతెలంగాణ-భైంసా



భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆనంద్‌రావ్ పటేల్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా ఎండీ ఫారూక్ అహ్మద్, డైరెక్టర్లుగా డి. రామేశ్వర్, నడిమి శెట్టి భూమన్న, షేక్ మౌలమియా, తోట రాము, రాథోడ్ రాంనాథ్, జాదవ్ సురేఖ, గడపలే దేవిదాస్, సట్ల కిష్టన్న, మాధవ్ రావ్, సుధాకర్ రావ్, కుంటోళ్ల విఠల్, కదం దత్తారం పటేల్‌లు నియామకమయ్యారు. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న ఆనంద్ రావ్ పటేల్‌కు పదవీ దక్కడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది.

జిల్లాకు వచ్చిన వనపర్తి ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదిలాబాద్‌కు వచ్చారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటుతుందంటున్నారు. అలాగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోను పార్టీ విజయ ఢంకా మోగించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, యెల్మెల్వార్ రామ్ కుమార్, ఇమ్రాన్, నాయకులు పోరెడ్డి కిషన్, ఎంఏ షకీల్, సింగిరెడ్డి రామ్ రెడ్డి, మొహమ్మద్ రఫీక్, బూర్ల శంకరయ్య, అల్చెట్టి నాగన్న ఉన్నారు.

గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఖాదీ మేళా

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్ లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిస్తాన్ (జమ్మికుంట) ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టాల్‌లోని వస్త్రాలను పరిశీలించారు. రాయితీ వివరాలు ఉద్యోగులకు స్పష్టంగా వివరించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ నెల 29వ వరకు నిత్యం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మేళదుంటుందన్నారు. వస్త్రాల కొనుగోలుపై 25 నుండి 40 శాతం వరకు రాయితీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, నిర్వాహకులు చంద్రమౌళి, సతీష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సకారం కోడలు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావు ఆమె భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయన వెంట అగర్‌గూడ మాజీ సర్పంచ్ పాలే సుధాకర్, నాయకులు చౌదరి తిరుపతి, సయ్యద్ సాజిద్, పూజారి వెంకన్న, మారయ్య, వెంకన్న, శంకర్, సాగర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రానున్న కేటీఆర్

- బహిరంగ సభకు ఏర్పాట్లు సిద్ధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుండే ఈ పోరుబాట ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగానే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నారు. ఈనెల 24న నిర్వహించే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో సభకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. జన సమీకరణకు కొన్ని రోజుల నుండి రూరల్‌లోని ఆయా గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. కేటీఆర్ సభకు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో స్వాగత ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.

సభకు ప్రజలు తరలిరావాలి

కేటీఆర్ సభకు సర్వం సిద్ధం చేసినట్లు మాజీ మంత్రి జోగురామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. సభ ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు గానూ చేపడుతున్న సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నేతలు ప్రచారం చేశారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతాంగంతో పాటు సామాన్య ప్రజానీకం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో రైతులు అదే రెపడకుండా కేటీఆర్ సారధ్యంలో పార్టీ రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు కేటీఆర్ చేపడుతున్న పోరుబాట సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, అన్నదాతలకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, రౌతు మనోహర్, రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, పండ్ల శ్రీనివాస్, దమ్మ పాల్, బట్టు సతీష్, అయూబ్ పర్వీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు పోలీసులు చట్టాలు, ఆయుధాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి-రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్ పాల్గొని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు వాడే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఆయుధాల విడి భాగాలు, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టమ్, పోలీస్ కంట్రోల్ రూమ్ పరికరాలు, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ హెడ్ కానిస్టేబుళ్ల పోలీస్ సిబ్బంది విధులు గురించి, రికార్డుల గురించి, నేరం జరిగిన సమయంలో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు, దర్యాప్తు, విచారణ నిందితులను పట్టుకోవడం వారిని కోర్టు ముందు హాజరు పరచడం, వారికి శిక్షల గురించి వివరించారు. పోలీస్ శాఖ ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి డయల్ 100, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది విధులు, షీ టీమ్స్ పనితీరు, మహిళా రక్షణ కోసం ఉన్న సాంకేతిక యాప్‌ల గురించి, సైబర్ నేరాలపై డయల్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి-2 టౌన్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ లవన్ కుమార్, తాళ్లగురిజాల హెడ్ కానిస్టేబుళ్లు అయిన అశోక్, ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల స్మరకోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయుధాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, హిస్టరీ షీట్స్, స్టేషన్ లాకప్, స్టేషన్లో ఉపయోగించే ఆయుధాలు, డయల్ 100 వ్యవస్థ విధానం, ముఖ్య విధులు, పోలీస్ యూనిఫాం, ట్రాఫిక్ రూల్స్, నూతన చట్టాలు, ఇతర అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జైపూర్ : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎస్ఐ స్వేత పోలీసు విధులపై అవగాహణ కల్పించారు. బుధవారం పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఓపన్ హౌస్ కార్యక్రమం ద్వార పోలీసుల విధులు, పోలీస్‌స్టేషన్ నిర్వాహణ, రికార్డులు, పరిసరాలు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రి : పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను, సేవలను స్మరించుకోవడానికి నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈఓపెన్ హౌస్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసుల డైరీలు, హిస్టరీ షీట్స్, లాకప్, ఆయుధాలు, డయల్ 100 వ్యవస్థ పనిచేయు విధానం, పోలీసుల ముఖ్య విధులు, యూనిఫాం, ట్రాఫిక్ రూల్స్, నూతన చట్టాలు ఇతర అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-లక్సెట్టిపేట

పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీటీడీఓ గంగారం సూచించారు. బుధవారం ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు వంటశాల పరిశీలించారు. పౌష్టికాహార భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి జరిగిన ఎస్ఏ వన్ పరీక్షల్లో ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో మునగ మొక్కలను నాటారు. ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా క్రీడల పట్ల కూడా విద్యార్థులకు ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన జాతీయ సైకిల్ పోల పోటీలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఆయన వెంట వసతి సంక్షేమ అధికారి మల్లారెడ్డితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పిల్లలు, యువకులు, వృద్ధులు అనేక రకాల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని దీనిపై అవగాహన చాలా అవసరమని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ అన్నారు.లైన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో నిర్వహించే క్యాన్సర్ అవగాహన వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కా, గంజాయి, పొగాకు వ్యసనాలకు అలవాటు పడి యువత క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ చేస్తున్న ఈ కార్యక్రమానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.శ్రీనివాస్, సౌమ్య, లైన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ అధ్యక్షుడు కూనింటి చంద్రమోహన్ రెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ గౌడ్, జోన్ చైర్మన్ ఎల్.రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ నేరెళ్ల హనుమంతు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్‌చాంద గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తుందన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందన్నారు. కార్యకర్తలు ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదును పెద్ద మొత్తంలో చేసి ముధోల్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. కార్యక్రమంలో లోకేశ్వరం మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అనసూయతో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ భూమిని గుర్తించాలి

నవతెలంగాణ-జైపూర్

నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మిస్తున్న ఎన్‌హెచ్ నెం. 163 నిర్మాణంలో నష్టపోతున్న అటవీ భూమికి ప్రత్యామ్నయంగా భూమిని గుర్తించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములు, స్థానిక తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి బుధవారం నష్టపోతున్న భూములను పరిశీలించారు. జాతీయ రహదారి 163 (జీ)నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మ-విజయవాడ వరకు రహదారి నిర్మాణంలో జిల్లా పరిధిలో భూసేకరణ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జైపూర్, టేకుమట్ల, ఎల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల గ్రామాలలో సేకరించాల్సిన 110 హెక్టార్ల భూమిలో ఇప్పటి వరకు 83 హెక్టార్ల భూమి అప్పగించినట్లు తెలిపారు.

జీఓ నెంబర్ 29ను రద్దు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రూప్-1 ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 29ను రద్దు చేయాలనీ కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూను కోవడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో గర్మకుర్తి వెంకటేష్, జాదవ్ రవి, గొల్లపల్లి శ్రీనివాస్, సాదని నర్సయ్య, బీఎస్పీ ఖానాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు కాటం ప్రభాకర్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తుడుం దెబ్బ నాయకులు అక్రమ వసూళ్ళకు పాల్పడితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పూర్క బాపూరావ్ అన్నారు. బుధవారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు తుడుం దెబ్బ అనుబంధ సంఘ నాయకులు ఎవరైనా అక్రమ వసుళ్లకు పాల్పడితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని సమావేశంలో తీర్మానించామన్నారు. నవంబర్ 10 నుండి 20 వరకు జిల్లాలో నిర్వహించే తుడుం దెబ్బ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు తొడసం శంకర్, భారత్, మండల గౌరవ అధ్యక్షులు జగ్గక్ భారత్, మండల అధ్యక్షులు పూర్క చిత్రు, మేస్రం నాగ్‌నాథ్, ముఖడే ఉత్తం, కనక తులసి రామ్, మురహరి పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన లబ్దిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎఎస్ఓ వేణులతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రేషన్‌డీలర్ల సంఘం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చౌకధరల దుకాణాల్లో సరుకుల వివరాలు, నిల్వలు, ధరల వివరాలు ప్రదర్శించాలని, రేషన్‌షాపు డీలర్ సంబంధిత రేషన్ షాపు నెంబర్, చిరునామా, మొబైల్ నెంబర్ నోటీస్ బోర్డులో ఉంచాలని తెలిపారు. సరుకులు పంపిణీ సమయంలో డీలర్ ఖచ్చితంగా ఉండాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలో ఆకస్మికంగా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తోటి మిత్రునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన 1990 సంవత్సరంలో తమతో చదువుకున్న మిత్రుడు కే. రాజు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. తోటి మిత్రునికి తమ వంతు సాయం చేయాలనే ఉద్దేశంతో బుధవారం అందరూ కలిసి రూ. పదివేల సాయం అందించి ధైర్యంగా ఉండాలన్నారు. మిత్రులు గంగాధర్ అయ్యా, మునీర్ ఖాన్, భూపతి, గంగారెడ్డి, వెంకట్ రెడ్డి, గంగన్న ఉన్నారు.

భారీ వాహనాలకు అనుమతించాలి

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో సమస్యలను వివరించి భారీ వాహనాల అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. బుధవారం తెలంగాణ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టైగర్ జోన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. భారీ వాహనాలు నిషేధించడంతో జన్నారం, కడెం, దస్తురాబాద్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ తదితర మండలాల అభివృద్ధి ఆగిందన్నారు. అధికారులు స్పందించి వెంటనే భారీ వాహనాలకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్ ఉన్నారు.

కాంట్రాక్ట్ వైద్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్లు, సీఎంఓ, సీఏఎస్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు జిల్లా వెబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. ఈనెల 29న 10:30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు డైరెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 08732-358086, 9848057606కు సంప్రదించాలని సూచించారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ సుధాకర్ అన్నారు. బుధవారం తపాలపూర్ గ్రామంలో మహిళా సంఘాలకు నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత అవగాహన సదస్సును తెలంగాణ గ్రామీణ బ్యాంకు తపాలపూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘాలకు చిరు వ్యాపారస్తులకు మహిళా ముద్ర యోజన పథకం ద్వారా తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంత ప్రజలు అభివృద్ధి బాట పట్టాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రెట్టింపు స్థాయిలో రుణాలను పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ టి.సుధాకర్, బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, వై.రమేష్ కల్చరల్ టీం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు

ట్రిపుల్ ఐటీలో జాతీయ సదస్సు

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచీకరణ ప్రభావం గణిత శాస్త్ర సవాళ్లు అనే అంశంపై బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆదేశాల మేరకు గణిత శాస్త్ర నిపుణులు, ఆచార్యులతో కలిసి ఆర్జీయూకేటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గణిత శాస్త్రం నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే పరిష్కార మార్గాలను వెలికితీస్తుంన్నారు. ప్రధానంగా వాతావరణ నమూనాలను అర్థం చేసుకోవడం, ఇంజనీరింగ్ విద్యలో గణిత శాస్త్ర పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. వైఎస్.రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో మాత్రికల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, గ్రాఫ్ థియరీలో దీని ఉపయోగాలను వివారించారు. ఫినిట్ డిఫరెన్స్ మెథడ్, థామస్ అల్గోరిథం ఉపయోగించిన తీరును ఈసందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె సత్యనారాయణ, సమన్వయకర్త జి తిరుపతి, అసోసియేట్ డీన్స్ డా.పావని, డా.చంద్రశేఖర్, మహేష్, మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు సునీల్ కుమార్, డా.కుమార్ రాగుల, బాలరాజు, సత్తన్న, సాయన్న, ప్రకాష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.